నేడు మంచిర్యాల, నస్పూర్ మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ల ఎన్నిక

మంచిర్యాల మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీవో రాములు, కమిషనర్ మారుతీప్రసాద్

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 8: మంచిర్యాల మున్సిపాలిటీకి నూతన చైర్మన్, వైస్‌చైర్మన్‌ల ఎన్నిక ఈ నెల 9న నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం ఆర్డీవో ఎన్నికల అధికారి వాడాల రాములు, మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ పరిశీలించారు. కౌన్సిల్ హాలులో ఉదయం 11 గంటలకు చైర్మన్, 11.30 గంటలకు వైస్‌చైర్మన్ ఎన్నికలను నిర్వహించనున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 36 మంది కౌన్సిలర్లలో 18 మంది కౌన్సిలర్లు హాజరైతేనే కోరం ఉన్నట్లు భావించి సమావేశం నిర్వహిస్తామని, అనంతరం చైర్మన్, వైస్‌చైర్మన్ల ఎన్నికలు నిర్వహిస్తామని ఆర్డీవో రాములు తెలిపారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానం నెగ్గిన తర్వాత ఈనెల 3వ తేదీనే 26మంది కౌన్సిలర్లు గోవాకు తరలివెళ్లారు. వీరంతా శుక్రవారం శిబిరం నుంచి నేరుగా మున్సిపల్ సమావేశానికి హాజరుకానున్నారు.

ఉప్పలయ్య, మహేశ్ ఎన్నిక ఏకగ్రీవమే..!

అసెంబ్లీ ఎన్నికలకు ముందే తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత మంచిర్యాల చైర్మన్‌గా ఉప్పలయ్య, వైస్‌చైర్మన్‌గా సల్ల మహేశ్‌ను చేస్తానని ప్రేంసాగర్‌రావు ప్రకటించడంతో అందుకు కౌన్సిలర్లంతా అంగీకరించారు. దీంతో వారి ఎన్నిక ఏకగ్రీవం కానుందని సమాచారం.

నస్పూర్ మున్సిపాలిటీలో నూ..

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 8: ఈ నెల 9న నస్పూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక నిర్వహించనున్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. జనవరి 11న మున్సిపల్ కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారి, మంచిర్యాల ఆర్డీవో రాములు సమక్షంలో అవిశ్వాస తీర్మానం నెగ్గింది. వారం క్రితం కౌన్సిలర్లు కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ సుర్మిళ్ల వేణు ఆధ్వర్యంలో విజయవాడ క్యాంపునకు తరలివెళ్లారు. వీరంతా నేరుగా 9న ఉదయం 10గంటలకు మున్సిపల్ కార్యాలయానికి చేరుకోనున్నారు. చైర్మన్‌గా సుర్మిళ్ల వేణు, వైస్ చైర్మన్‌గా గెల్లు రజిత పేర్లను ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఇది వరకే ప్రకటించడంతో వారి ఎన్నిక లాంఛనం కానుంది.

బెస్ట్ అవైలబుల్ పాఠశాల పథకానికి దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 8 : 2023-24 విద్యా సంవత్సరానికిగాను ఉత్తమ పాఠశాల సౌకర్యాల పథకం కింద ఎంపిక చేసేందుకు ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల(ఇంగ్లిష్ మీడియం) నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు ఉన్నతమైన ప్రాథమిక విద్యను ఇంగ్లిష్ మీడియంలో అందించేందుకు ఆసక్తి కలిగిన విద్యా సంస్థలు, హాస్టల్ వసతి, మౌలిక వసతులు కలిగి ఉండాలని, గత ఐదేండ్లలో పదవ తరగతిలో 90 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండి 50 శాతం ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఒకటవ తరగతి నాన్ రెసిడెన్షియల్ (డే స్కాలర్) విద్యార్థులకు రూ. 28 వేలు, ఐదవ తరగతి రెసిడెన్షియల్ (వసతి గృహం) విద్యార్థులకు రూ. 42 వేలు అందించనున్నట్లు తెలిపారు. ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తులను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకుల కార్యాలయంలో అందజేయాలని, ఇతర వివరాలకు కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలని కోరారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి వెంకట రమణ

ధ్రువీకరణ పత్రాలతో శిక్షణ పొందిన మహిళలు

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 8 : మహిళలు మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని, ఉపాధి అవకాశాలను అందుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి కౌశిక్ వెంకటరమణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఒక ఫంక్షన్ హాలులో తెలంగాణ ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ప్రొడక్టివిటి కౌన్సిల్‌తో మంచిర్యాల ప్రాంత మహిళలకు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీపీసీ కో ఆర్డినేటర్ సత్యం, శిక్షణ నిర్వాహకులు యాసిన్, సుజిత్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యతను ప్రదర్శించాలి : ప్రిన్సిపాల్ సుమతి

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 8 : వృత్తి ఉద్యోగాల్లో నైపుణ్యత ప్రదర్శించినప్పుడే ముందుకు వెళ్లగలమని కళాశాల ప్రిన్సిపాల్ సుమతి పేర్కొన్నారు. గురువారం తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో కోకకోలా బెవరేజ్స్ ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామ్యంతో నిర్వహించిన క్యాంపస్ టూ కార్పొరేట్ పేరిట నిర్వహించిన సాఫ్ట్ స్కిల్స్ ప్రోగ్రాంలో ట్రైనర్ ఎండీ అబ్దుల్ కలిసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కే శివలీల, టాస్క్ కో ఆర్డినేటర్ టీ కవితా రాణి, కమిటీ సభ్యులు బీ దేసిపాల, జిక్రన్, సయ్యద్, శైలజ, డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థినులు తదితరులున్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుమతి

ప్రసవాల సంఖ్య పెంచాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 8 : దవాఖానలో ప్రసవాల సంఖ్యను పెంచాలని సంబంధిత వైద్యులకు డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ హెల్త్ సూపరింటెండెంట్ కోటేశ్వర్‌రావు సూచించారు. గురువారం వంద పడకల దవాఖానను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల వివరాలు తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనల చేశారు. ఆయనతో పాటు సూపరింటెండెంట్, వైద్యులు ఉన్నారు.

దవాఖానను తనిఖీ చేస్తున్న డీసీహెచ్ఎస్

'ప్రజాపాలన' నమోదు వేగవంతం చేయాలి

జైపూర్, ఫిబ్రవరి 8 : ప్రజా పాలన దరఖాస్తుల పరిశీలన, వివరాల నమోదును వేగవంతం చేయాలని మంచిర్యాల డీపీవో వెంకటేశ్వర్ రావు అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ప్రత్యేక పారిశుధ్య పనులను అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన దరఖాస్తుల వివరాలు మొబైల్ యాప్‌లో నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇది వరకు తీసుకున్న ప్రజాపాలన దరఖాస్తుల లబ్ధిదారుల గృహాలకు వెళ్లి పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఆయా గ్రామాల చెందిన ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్న అధికారులు

'గృహజ్యోతి' కోసం వివరాలు అందుబాటులో ఉంచాలి

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 8: గృహజ్యోతి పథకం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యుత్ వినియోగదారులు ప్రజాపాలనలో అందజేసిన దరఖాస్తు రసీదు, తెలుపురంగు రేషన్‌కార్డు నంబర్, ఆధార్ కార్డు నంబర్‌ను అందుబాటులో ఉంచుకోవాలని, మీటర్ రీడింగ్ కోసం వచ్చిన సిబ్బందికి ఆ వివరాలను అందించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ శేషారావు తెలిపారు. ఒక వేళ ఏదైనా కారణంతో అందుబాటులో లేని వాళ్లు సమీపంలోని ఏఈ కార్యాలయంలో గానీ, విద్యుత్ సహాయ గణాంక అధికారి కార్యాలయంలో వివరాలను అందించాలని తెలిపారు.

సదరం శిబిరం

మంచిర్యాల ఏసీసీ, ఫిబ్రవరి 8: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో గురువారం ఆర్థో విభాగానికి సంబంధించిన సదరం శిబిరాన్ని అధికారులు నిర్వహించారు. ఆన్‌లైన్లో 50 మంది స్లాట్ బుక్ చేసుకోగా 49 మంది హాజరయ్యారు. ఆర్థోవైద్యుడు బిందూసర్ వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అర్హులకు సర్టిఫికెట్లను అందజేయనున్నట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక

దండేపల్లి(లక్షెట్టిపేట), ఫిబ్రవరి 8 : స్థానిక ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థి నందిని 10 సంవత్సరాల విభాగంలో లాంగ్‌జంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం ఎంఏ గఫార్, జిల్లా క్రీడల అధికారి బండ జీవరత్నం తెలిపారు. విద్యార్థిని జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి మడావి గంగారాం, ఏసీఎంవో మారుతి రాజమౌళి, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాంబమూర్తి, మారయ్య అభినందించారు.

స్టడీ మెటీరియల్ అందజేత

దండేపల్లి, ఫిబ్రవరి 8 : మండలంలోని గుడిరేవు ప్రభుత్వ పాఠశాల పదోతరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థులు స్టడీ మెటీరియల్ అందజేశారు. రవితేజ, మనోజ్, సంతోష్, అజయ్, సాగర్, కిరణ్, అంజన్న, వెంకటేశ్‌ను హెచ్ఎం శ్రీనివాస్ అభినందించారు.

వైద్య పరీక్షలు

కోటపల్లి, ఫిబ్రవరి 8 : అనిమియా ముక్త్ కార్యక్రమాలో భాగంగా కోటపల్లి మోడల్ స్కూల్‌లో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థుల రక్త నమూనాలను సేకరించి హిమోగ్లోబిన్ పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వారణాసి సురేందర్, సీనియర్ ఉపాధ్యాయులు వీరస్వామి పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

చెన్నూర్, ఫిబ్రవరి 8: చెన్నూర్ పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో రేకుర్తి కంటి దవాఖాన వారి ఆధ్వర్యంలో మంచిర్యాల లయన్స్‌క్లబ్ వారు గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో కంటి వైద్య నిపుణులు అభిషేక్, ప్రభాకర్, భాస్కర్‌రెడ్డి కంటి పరీక్షలు చేశారు. కంటి పరీక్షల అనంతరం ఆపరేషన్ అవసరం ఉన్న వారిని 120 మందిని గుర్తించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్, కార్యదర్శి రాఘవేందర్‌రావు, కోశాధికారి శంకర్‌లింగం, సభ్యులు రాంచందర్, మల్లికార్జున్, బాలాజీ, ప్రవీణ్, సుధాకర్, సత్యసాయి సేవా సమితి సభ్యులు చిలువేరు మల్లిక్, అయ్యప్ప సేవా సమితి సభ్యులున్నారు.

సింగరేణి

లక్ష్యాలను సమష్టి కృషితో సాధించాలి

- మందమర్రి ఏరియా జీఎం ఏ మనోహర్

బెల్లంపల్లి, ఫిబ్రవరి 8 : సింగరేణి యాజమాన్యం ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు కార్మికులు, ఉద్యోగులు సమష్టి కృషితో సాధించాలని మందమర్రి ఏరియా జీఎం ఏ మనోహర్, ఎస్వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. గురువారం మందమర్రి ఏరియాలోని శాంతిఖని గని క్యాంటీన్‌లో నిర్వహించిన మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. సంస్థ సాధించిన ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలను సాధించిన విషయాలను సమగ్రంగా వివరించారు. భూగర్భ, ఓపెన్‌కాస్ట్ గనుల్లో యంత్రాల వినియోగం, సింగరేణిలో అమలు చేస్తున్న సంక్షేమ, ఫైనాన్స్ విషయాలను వివరించారు. కంపెనీ భవిష్యత్ ప్రణాళిక, లక్ష్యాన్ని సాధించేందుకు చేయాల్సిన పనులను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, శాంతిఖని గ్రూప్ ఏజెంట్ విజయ్‌ప్రసాద్, సీఎంవోఏఐ వైస్ ప్రెసిడెంట్ నాగవర్ధన్, ఏజీఎంతః అండ్ఎం ఎం.నాగరాజు, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, డీజీఎంఐఈడీ పీ రాజన్న, గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా తదితరులు పాల్గొన్నారు.

యంత్రాలతోనే ఉత్పత్తి సాధ్యం

- శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్ ఓసీపీపై షావల్‌ను ప్రారంభిస్తున్న జీఎం, పీవోలు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 8 : అందివచ్చిన యంత్రాలతో సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యం సాధ్యమవుతుందని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి పేర్కొన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఓసీపీలో నూతనంగా కొనుగోలు చేసిన షావల్, 3 డంపర్లను జీఎం సంజీవరెడ్డి, పీవో పురుషోత్తంరెడ్డి ప్రారంభించారు. రూ.4.63 కోట్లతో 760 హెచ్‌పీ సామర్థ్యం గల షావల్‌ను, 65 టన్నుల సామర్థ్యం గల 3 డంపర్లు తీసుకున్నట్లు తెలిపారు. ఓసీపీల్లో యంత్రాలతోనే ఉత్పత్తి లక్ష్యాలు సాధించగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, మేనేజర్ సుధీర్ జక్కులవార్, ఈఈ చంద్రశేఖర్, శ్యామ్‌సుందర్‌రావు, నాయకులు సత్తయ్య, సీనియర్ పీవో శంకర్ పాల్గొన్నారు.

సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 8 : సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం 2024 క్యాలెండర్‌ను గురువారం జీఎం సంజీవరెడ్డి ఆవిష్కరించారు. సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ కర్ణ ఆధ్వర్యంలో జీఎం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ గోపాల్‌సింగ్, నాయకులు భూక్యా చందర్, ధరావత్ నవీన్‌కుమార్, శశిధర్, ఇస్లావత్ దిలీప్‌కుమార్, భరత్‌నాయక్ పాల్గొన్నారు.

'రూ.30 లక్షలు ఖర్చు పెట్టి నియామక పత్రాలివ్వడం సరికాదు'

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 8 : సింగరేణి యాజమాన్యం రూ.30 లక్షలు ఖర్చు పెట్టి హైదరాబాద్‌లో కార్మికుల పిల్లలకు కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలివ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా పేర్కొన్నారు. గురువారం శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 141 మంది యువకులకు జూనియర్ అసిస్టెంట్, 300 మంది కార్మికుల పిల్లలకు కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలను డిప్యూటీ సీఎం బట్టీ విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, కోల్ బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు పాల్గొని ఇచ్చారని తెలిపారు. గతంలో మాదిరిగా ఏరియాల్లోనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒక్కో కార్మికుడికి రూ.1600 ఖర్చు వచ్చిందని తెలిపారు. సింగరేణి సంస్థ గుర్తించిన గనులను కేంద్ర ప్రభుత్వం వెంటనే సింగరేణికే ఇవ్వాలన్నారు. ఈ నెల 16 చేపట్టే సమ్మెలో కార్మికులు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొమురయ్య, సంఘం సదానందం పిట్ కార్యదర్శులు రాజయ్య, మహేశ్, నవీన్‌రెడ్డి, పరశురాం, నర్సింగారావు, ఏ రాజయ్య పాల్గొన్నారు.

లక్ష్యాలను అధిగమించాలి

జైపూర్, ఫిబ్రవరి 8: ఓపెన్‌కాస్టు, భూగర్భ గనుల్లో ఉత్పత్తి ఉత్పాదకత పెంచి లక్ష్యాలను అధిగమించాలని మల్టీ డిపార్ట్‌మెంటల్ టీం కన్వీనర్ రఘుకుమార్ అన్నారు. గురువారం శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఇందారం ఓపెన్‌కాస్టు గని, భూగర్భ గనిపై మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వచ్చిన కన్వీనర్ మాట్లాడారు. ఉత్పత్తిలో నాణ్యత ప్రమాణాలు పెంచుకుని సంక్షేమానికి సంబంధించిన అంశాలపైన ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం అధికారులు, కార్మికులు రక్షణ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి కొమురయ్య, ఇందారం ఓపెన్‌కాస్టు ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎం అరవింద్, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, ఏఎస్వో శ్రీధర్‌రావు తదితరులున్నారు.

సమష్టిగా పని చేయాలి

తాండూర్, ఫిబ్రవరి 8 : బెల్లంపల్లి ఏరియా తాండూర్ మండలంలోని ఏరియా వర్క్‌షాప్‌లో గురువారం మల్టీ డిపార్ట్మెంట్ కమిటీ అధికారులు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌చార్జి ఎస్వోటూజీఎం నాయిని ఉమాకాంత్ మాట్లాడుతూ..సింగరేణి సంస్థ గతంలో సాధించిన లక్ష్యాలు, భవిష్యత్‌లో లక్ష్యాల సాధనకు పనితీరు ను వివరించారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సింగరేణి సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత, ఉద్యోగులు, యంత్రాల పనితీరు గణాంకాలను వివరించారు. సంస్థ అభివృద్ధికి కోసం చేపట్టాల్సిన కార్యాచరణ పై ఉద్యోగుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహార, డీజీఎం (ఎఫ్ అండ్ ఏ) రామారావు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, అన్ని విభాగాల అధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఆర్ తుది జాబితా విడుదల

నస్పూర్, ఫిబ్రవరి 8 : ఫొటో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం 2024లో భాగంగా ఓటరు జాబితా రూపకల్పన తుది జాబితా విడుదల చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ గురువారం ప్రకటనలో తెలిపారు. చెన్నూరు నియోజకవర్గంలో 95,974 మంది పురుషులు, 97,264 మంది స్త్రీలు, 7 మంది ట్రాన్స్ జెండర్లు, 7 మంది ఎన్ఆర్ఐ, 134 మంది సర్వీసు ఓటర్లు, బెల్లంపల్లి నియోజకవర్గంలో 86,802 మంది పురుషులు, 88,530 మంది స్త్రీలు, 13 మంది ట్రాన్స్‌జెండర్లు, 2 మంది ఎన్ఆర్ఐలు, 162 మంది సర్వీసు ఓటర్లు, మంచిర్యాల నియోజకవర్గంలో 1,38,472 మంది పురుషులు, 1,40,559 మంది స్త్రీలు, 25 మంది ట్రాన్స్‌జెండర్లు, 27 మంది ఎన్ఆర్ఐలు, 335 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారని తెలిపారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా 3,21,248 మంది పురుషులు, 3,26,353 మంది స్త్రీలు, 45 మంది ట్రాన్స్‌జెండర్లు, 36 మంది ఎన్ఆర్ఐలు, 631 మంది సర్వీసు ఓటర్లున్నారని తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-319433-All
CHANGE OF NAME
★ I, SALLA VAISHNAVI, W/o. Salla Naresh, R/o. 14-126/6-19/A/1, Green City, Rangampet, Mancherial, TS. Changed My Name as SALLA VISHNAVI, W/o. Salla Naresh.
NT-311089
★ I, ODDI SARITHA, D/o. Oddi Lingaiah, R/o. 14-126/6-19/A/1, Green City, Rangampet, Mancherial, TS. Changed My Name as SALLA VISHNAVI, W/o. Salla Naresh.
NT-311089
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, తుపాకులగూడెం: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలి

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 8: మంచిర్యాల పట్టణంలోని రాంచెరువుకు ఉత్తరాన ఉన్న వందఫీట్ల రోడ్డుపై జరుగుతున్న అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరుతూ గురువారం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రాముని చెరువు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. వందఫీట్ల రోడ్డుకు మధ్యలో ఓ వ్యక్తి అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నాడని, రాత్రిపూట పనులను చేస్తున్నారని, ఈ విషయంలో వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్షుడు కనుకుంట్ల మల్లయ్య, రాముని చెరువు కట్ట వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి మొగిలి తిరుపతి, సభ్యులు రంగు రాజేశం, కైలాసం, రాధేశ్యాం, మహ్మద్ పాషా, రవూఫ్, అంజయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ నిర్మాణ స్థలంలో అక్రమ కట్టడాలపై ఫిర్యాదు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 8 : నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంపూర్ ఆర్కే 6 గుడిసెలు కొత్తరోడ్ చౌరస్తాలో ప్రభుత్వం బస్‌షెల్టర్ కోసం కేటాయించిన స్థలంలో చేపడుతున్న అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని సింగాపూర్ మాజీ సర్పంచ్ గుంట జగ్గయ్య నస్పూర్ తహసిల్దార్, మున్సిపల్ కమిషనర్లకు ఫిర్యాదు చేశారు. తెలంగాణా ప్రభుత్వం రూ.4 లక్షల సీడీపీవో నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రయాణికులకు బస్ షెల్టర్ నిర్మించకుండా మాజీ వార్డు సభ్యుడు గడ్డం శంకర్ తన వ్యాపార సముదాయం నిర్మించేందుకు అక్రమ కట్టడాలు చేపడుతున్నారని ఫిర్యాదు చేశారు. నేషనల్ హైవే కాలువలు, స్థానిక వరదకాలువలు సైతం ఆక్రమించి వాటిపై ఆర్‌సీ బిల్లులు వేసి నిర్మాణాలు చేపట్టడాన్ని వెంటనే ప్రభుత్వ అధికారులు అడ్డుకోవాలని కోరారు.

అండర్‌బ్రిడ్జి రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని వినతి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 8 : తాండూర్ మండలంలోని అండర్ బ్రిడ్జి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఎంపీటీసీ సిరంగి శంకర్ కోరారు. ఈ మేరకు గురువారం బెల్లంపల్లి రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్‌కి ఆయన వినతిపత్రం సమర్పించారు. ఐబీ తాండూర్‌లోని అండర్‌బ్రిడ్జి 66, 67ల వద్ద రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వివరించారు. తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కాంగ్రెస్ పార్టీ తాండూర్ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, నాయకుడు నల్లాల మహేశ్ ఉన్నారు.

యూటర్న్ ఏర్పాటు చేయాలి

తాండూర్, ఫిబ్రవరి 8 : మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలో యూటర్న్, డీ-ప్రెస్ అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తాండూర్ ఎంపీటీసీ సిరంగి శంకర్, కాంగ్రెస్ తాండూర్ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాండూర్ పెట్రోల్ బంక్ సమీపంలో జాతీయ రహదారి ఫోర్ వే లైన్ రోడ్డుపై యూటర్న్ లేకపోవడంతో తాండూర్‌కు వచ్చిపోయే ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు పేర్కొన్నారు. దీనిపై నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

జిల్లా టీఎన్జీవో ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

హాజీపూర్, ఫిబ్రవరి 8 : తెలంగాణ నాన్ గెజిటెడ్ (టీఎన్జీవో) ఆఫీసర్స్ యూనియన్ మంచిర్యాల జిల్లా ఎన్నికలను సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీష్ గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లా ఎన్నికల పర్యవేక్షణకు జిల్లా కేంద్రానికి వచ్చ